www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 13 జనవరి 2025
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ





కడియపు లంక పల్ల వెంకన్న నర్సరీలో ప్రజలకు విరులతో ఇలా శుభాకాంక్షలు తెలిపారు. నర్సరీ అధినేత పల్ల సత్తిబాబు, యువ రైతులు వెంకటేష్, వినయ్ ఆధ్వర్యంలో దీన్ని తీర్చిదిద్దారు.

కోడి పందేలకు సై...

- పోలీసుల ఆదేశాలు బేఖాతర్
- ఇప్పటికే పలుచోట్ల బరులు సిద్ధం
- డిప్యూటీ సిఎం ఇలాకాలో 35 బరులు
- అండగా అధికార పార్టీ నేతలు ?

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా కోడి పందేలకు నిర్వాహకులు సై కొడుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల బరులను సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏర్పాటైన కోడి పందేల నియంత్రణ క్షేత్రస్థాయి అధికారులు పహారా పెరగడంతో ఆదివారం రకూ బరులు సిద్ధం కాలేదు. కొన్ని చోట్ల తమ భూముల్లో కోడి పందేలు నిర్వహించేందుకు రైతులు వ్యతిరేకించడంతో వారిని ఒప్పించేందుకు నిర్వాహకులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. కోన్సీమలో కొన్ని గ్రామాలు కోడిపందేల నిర్వహణకు ప్రసిద్ధి చెందాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాలలో పోలీసుల నిఘా పెరిగింది. సంక్రాంతి సంబరాల పేరుతో అధికార పార్టీకి చెందిన నాయకులు బరులు సిద్ధం చేస్తున్నారు. పోలీసు అధికారులు ఆంక్షలు విధించినప్పటికీ జూదరులను పట్టించుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించలేదు.

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రామచంద్రపురం, రాయవరం, మండపేట, రాజోలు, సఖినేటిపల్లి, ముమ్మిడివరం, అంబాజీపేట, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో భారీ బరులను ఏర్పాటు చేస్తున్నారు. బరుల వద్ద మంత్రులు, ఎంఎల్ఎలు, ఇతర నాయకులు ఫ్లెక్సీలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా 100 నుంచి 150 వరకూ బరులను ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఏదేమైనా తెల్లవారే సరికి బరులు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే సామగ్రిని ఆయా ప్రాంతాలకు తరలించారు.


పిఠాపురంలో ఏర్పాటు చేసిన బరి

కొత్తపేటలో మెయిన్‌రోడ్డును ఆనుకుని పెద్ద బరిని ఏర్పాటు చేస్తున్నారు. కార్మిక శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న రామచంద్రపురంలో ఆయన ఫ్లెక్సీలను పెట్టి మరీ భారీ బరిని సిద్ధం చేశారు.

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఇలాకా అయిన పిఠాపురం నియోజకవర్గంలో టిడిపి, జనసేన పార్టీల నాయకులు పోటాపోటీగా బరులను సిద్ధం చేస్తున్నారు. ఒక్క ఈ నియోజకవర్గంలోనే 35 వరకూ బరులను ఇప్పటికే నిర్వాహకులు సిద్ధం చేశారు. పిఠాపురం పట్టణంలోనే వైఎస్ఆర్ గార్డెన్స్‌లో అధునాతన హంగులతో బరిని ఏర్పాటు చేశారు. అందరికీ కనపడేలా తాత్కాలిక స్టేజిని నిర్మించి దానిపై మట్టితో బరిని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఫెన్సింగ్‌ను సైతం ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు, తుని, తొండంగి, గొల్లప్రోలు, పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట, గండేపల్లి మండలాల్లోనూ బరులను రాజు చేశారు.

తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండల కేంద్రంలో ఇప్పటికే బరులు సిద్ధం అయ్యాయి. తాళ్లపూడి మండలంలోని 6 గ్రామాల్లో 9 ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది ఆ ప్రాంతంలో మరో 10 బరులు అదనంగా ఏర్పాటు కానున్నట్లు తెలుస్తోంది. చాగల్లు మండలంలో మీనా నగరం, చిక్కాల, ఉన్నగట్ల, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, చంద్రవరం గ్రామ శివార్లలో బరులు ఏర్పాట్లు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. కొవ్వూరు మండలంలో కొవ్వూరు, పంగిడి, కుమరదేవం, దొమ్మేరు గ్రామాల్లో బరులు సిద్ధం చేశారు. నిడదవోలులో సింగవరంలో భారీ బరి సిద్ధమవుతోంది. గత ఏడాది నిర్వహించిన ప్రాంతాల్లో పోలీసులు పహారా పెంచారు. పెరవలిలో పెరవలి, కండవల్లి, అద్దరంలలో బరులు సిద్ధమవుతున్నాయి. గోకవరం మండలంలో కృష్ణుని పాలెం,మల్లవరం రెండు ప్రాంతాల్లో పందెం రాయుళ్లు బరులు వేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. సీతానగరం, కడియం, రాజమహేంద్రవరం రూరల్‌లోనూ భారీ బరులను ఏర్పాటు చేస్తున్నారు.

తెర వెనుక కూటమి నేతల ప్రోత్సాహం

టిడిపి, జనసేన నేతలు స్వయంగా తెరవెనుక ఉండి కోడి పందేల నిర్వహణ ప్రోత్సహిస్తున్నారు. ఒకొక్క బరి ఏర్పాటుకు నిర్వహకుల నుంచి సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు ప్రజాప్రతినిధులకు ముట్టచెబుతున్నట్లు సమాచారం. సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో ఇప్పటికే కోడిపందేలు ప్రారంభమయ్యాయి.కడియం మండలం బుర్రిలంకలోనూ సరిహద్దు ప్రాంతాలైన మడికి, చొప్పెళ్ల, నర్సిపూడి, ఏడిద, ఏడిద సీతాగనరంలలోనూ నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతం కంటే ఎక్కుకవగా ఈ సారి నోట్లు చేతులమారే అవకాశం కనిపిస్తోంది..

కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే చర్యలు

కోడిపందేలు, గుండాట, పేకాట తదితర జూదాలను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. ఇటువంటి ఆటలను నిరోధించడానికి జిల్లా అంతటా ప్రత్యేక నిఘా కొనసాగుతుంది. ఆడినా, నిర్వహించినా బైండోవర్ కేసులను నమోదు చేస్తాం. కోడిపందేలు, జూదం, గుండాట, ఇతర నిషేధిత ఆటలపై ఎటువంటి సమాచారం ఉన్నా 112కు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- డి.నరసింహకిశోర్, ఎస్‌పి, తూర్పు గోదావరి

పడవ జోరు.. పండుగ హోరు..

ప్రజాశక్తి - ఆత్రేయపురం


బోట్ల రేస్‌లో పాల్గొన్న క్రీడాకారులు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలోని గోదావరి మధ్య డెల్టా ప్రధాన కాలువలో కేరళ తరహా పడవ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. సంక్రాంతి సంబరాల నేపథ్యంలో 'సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ' పేరుతో స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈత, రంగవల్లులు, పడవ పోటీలను నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను శనివారం అమలాపురం ఎంపి హరీష్‌మాధుర్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రారంభించారు. తొలి రోజు ఈత, రంగవల్లుల పోటీలు జరిగాయి. ఆదివారం పడవ పోటీలను నిర్వహించారు. రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్, ఉంగుటూరు ఎంఎల్ఎ పి.ధర్మరాజు, రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బి.వెంకటరమణచౌదరి ఈ పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని 9 జిల్లాలకు చెందిన 11 జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నాయి. ఒక్కో పడవపై 11 మంది సభ్యులతో మొత్తంగా 121 మంది పోటీల్లో పాల్గొన్నారు. డ్రాగన్ పడవ పోటీలు, కయా కింగ్, కెనాయింగ్ విభాగాల్లో పోటీలు జరిగాయి. ఆరు జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధించాయి. జంగారెడ్డి గూడెం జెయింట్స్, పల్నాడు థండర్స్, ఎన్‌టిఆర్ ఈగల్స్, కోటిపల్లి చీతాస్, పల్నాడు ఫాంథర్స్, కృష్ణా లయన్స్ జట్లు సెమీస్‌కు అర్హత సాధించాయి. సెమీఫైనల్స్ సోమవారం జరుగనున్నాయి. ఆత్రేయపురం నుంచి ఉచ్చిలి వరకు గోదావరి మధ్య డెల్టా కాలువ ఇరువైపులా జనసందోహం సాగింది. సెంట్రల్ డెల్టా వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, టిడిపి మండల అధ్యక్షులు ముదునూరు వెంకటరాజు, తహశీల్దార్ టి.రాజేశ్వరరావు, ఎంపిడిఒ బికెఎస్-ఎస్.వెంకటరామన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొబ్బరి బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రావులపాలెం


దినోత్సవంలో పాల్గొన్న ఎంఎల్‌సిలు ఇళ్ల, కుడుపూడి, ఎంఎల్ఎ ప్రసాద్

కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డుకు సంబంధించిన కార్యాలయాన్ని తమ ఏరియాలో అనువుగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు కోరారు. ఆదివారం స్థానిక సిఆర్‌సిలో బోర్డ్ 45వ వ్యవస్థాపక దినోత్సవంలో ముఖ్యఅతిథులుగా ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, కోకోనట్ బోర్డు చైర్మన్ డాక్టర్ ప్రభాత్ కుమార్, రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్, ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, కుడుపూడి సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోకోనట్ డెవలప్మెంట్ బోర్డుకు సంబంధించిన కార్యాలయాన్ని అనువుగా ఉన్న తమ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని, బోర్డు చైర్మన్‌ను, అధికారులను కోరారు. కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర, మరింత ప్రోత్సాహకంగా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చర్యలు తీసుకోవాలన్నారు. కొబ్బరి పంటలకు కోనసీమ ప్రాంతం ప్రసిద్ధి చెందినదని తద్వారా ఈ ప్రాంతంలో కొబ్బరి ఉత్పత్తుల పారిశ్రామిక రంగాలు అభివృద్ధి చెందేందుకు బోర్డు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, అధిక సంఖ్యలో కొబ్బరి రైతులు తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులకు మంత్రి సుభాష్ కానుక

ప్రజాశక్తి-రామచంద్రపురం


సెక్యూరిటీ గార్డులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

పట్టణంలోని ఏరియా ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బందికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం రూ.65 వేల సంక్రాంతి కానుక అందజేశారు. ఆయన ఏరియా హాస్పిటల్ వైపు వెళుతూ గేటు దగ్గర విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డ్సును చూశారు. వెంటనే ఆయన కాన్వాయ్ దిగి నేరుగా వారి దగ్గరికి వెళ్లారు. వారిని పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి ఆనందంగా జరుపుకోవాలని ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున మొత్తం 13 మంది సెక్యూరిటీ గార్డులకు రూ.65 వేలు అందించారు. మంత్రి ఔదార్యానికి సెక్యూరిటీ గార్డ్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-మామిడికుదురు, ఉప్పలగుప్తం

లూటుకుర్రు కశిరెడ్డి వెంకటాచలం హైస్కూల్లో 1986-87 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు 38 ఏళ్ల తరువాత అదే స్కూలు ప్రాంగణంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. తాము చదువుకున్న రోజుల్లో స్కూలు జ్ఞాపకాలను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తమకు చదువులు నేర్పిన గురువులను సత్కరించారు. స్థానిక సర్పంచ్ అడబాల తాతకాపు, జెడ్‌పిటిసి కసిరెడ్డి అంజిబాబు, ఎంపిటిసి నామన వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థి ఆదుర్రు సర్పంచ్ బల్ల శ్రీనివాసరావు, హైస్కూల్ హెచ్‌ఎం నాగప్రసాద్, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ బోనం సత్తి రాజును ఘనముగా సత్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. పూర్వ విద్యార్థులు కడలి రాంబాబు, కుడిపూడి శ్రీధర్, కడలి నూకరాజు, పాయసం మాధవరావు నేతత్వం వహించారు.

ఉప్పలగుప్తం గొల్లవిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1993-94 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 31 ఏళ్ల తరవాత అదే పాఠశాలలో కలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన్నఉపాధ్యాయులు చిక్కం సత్తిరాజు, మధుర శ్రీకృష్ణమూర్తి, అంబటి సత్యనారాయణకు నివాళు లర్పించారు. గురువులు మోటూరి సుబ్రహ్మణ్యం, రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్, సలాది దేవతా వెంకటేశ్వర్లు, కొమ్ముల సూర్యనారాయణ, నిమ్మకాయల నాయుడు, మెండి సత్యనారాయణ, భోధనేతర సిబ్బందిని ఘనంగా సత్కరించారు. నూతన వస్త్రాలను అందజేశారు. పాఠశాలలో తెలుగు తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు, పాఠశాలకు సౌండ్ సిస్టం ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు.

పలుచోట్ల ఘనంగా సంక్రాంతి ఉత్సవాలు

సంక్రాంతి ఉత్సవాలను ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రామచంద్రపురం భారతీయుల పండుగలో ప్రధానమైన సంక్రాంతి పండుగను నేటి యువతకు తెలియజేసేందుకు పల్లె వాతావరణం ఉట్టిపడేలా సంక్రాంతి ఉత్సవాలు ఏర్పాటు చేశామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పట్టణంలోని విఎస్ఎం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుభాష్ నగర్ పేరుతో ఒక సెట్ ఏర్పాటు చేశారు. దీనిలో పల్లె పాకలు, పశువులు, మేకలు, పతంగులు, ప్రభలు, ఆలయం నమూనా ఆకట్టుకున్నాయి. మంత్రి మాట్లాడుతూ సంక్రాంతి అంటే పిండి వంటలు, గాలిపటాలు, ప్రభల తీర్థం, వంటి అనేక సంప్రదాయాలను నేటి యువతరానికి తెలిపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఏర్పాట్లను మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం సమీక్షించారు.

అమలాపురం సంక్రాంతి శోభను అందంగా తీర్చి దిద్దే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్టు మెట్రో కెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) అన్నారు. తన అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం సంబరాలను వైవిధ్యంగా చేస్తున్నామని తెలిపారు. వ్యాపారరీత్యా హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ సొంత ఊరులో పండుగ చేసుకోవాలనే తలంపుతో ఉత్సవాలను ప్రారంభించామన్నారు. అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల అనందరావు మాట్లాడుతూ ప్రతి ఏడాదీ ఈ ఉత్సవాలను ప్రత్యేకంగా తీర్చి దిద్దుతున్న మెట్రో కెమ్ అధినేత సొంత ఊరికి చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఆయనకు పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు. మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, గంధం పల్లంరాజు, అల్లాడ శరత్ బాబు, ఆశెట్టి అదిబాబు, గోకరకొండ సూరిబాబు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్ కెవిపిఎస్ జిల్లా మాజీ కన్వీనర్ వసంత్ కుమార్ స్మారకంగా ఈ సంవత్సరం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ నాయకులు కె.శంకర్, కె.రాంప్రసాద్, కె.ప్రణీత్ సాయి తెలిపారు. వన్నెచింతలపూడిలోని అంబేద్కర్ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద సంక్రాంతి సంబరాలు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసంత్ కుమార్ 1999 నుంచి ఈ గ్రామంలో ఆటలు పోటీలు సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్నారని, ఆయన 2023 ఏప్రిల్‌లో మృతి చెందారని తెలిపారు. ఆయన స్మారకంగా ఈ సంవత్సరం సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, కె.రామ్‌ప్రసాద్, కె.ప్రణీత్ సాయి, పి.నరేష్, సందీప్, నాని, సీనియర్ నాయకులు కె.శంకర్, బి.శ్రీను, కారెం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మామిడికుదురు పెదపట్నంలంకలో ఆదివారం 'మన పాత మండువా లోగిలి' పేరిట కొమ్ముల వారి కుటుంబాలు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి మహిళలు సందడి చేశారు. పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొనగా ఆయనను ఘనంగా సత్కరించారు


ఉప్పలగుప్తం ఎస్.యానాం బీచ్‌లో మూడు రోజులపాటు నిర్వహించే సంక్రాంతి సంబరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. బీచ్‌లో ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీచ్ బైకులను ఎంఎల్ఎ ఆనందరావు ప్రారంభించారు. సంక్రాంతి సంబరాలకు బీచ్‌కు వచ్చే వారికోసం అన్ని సౌకర్యాలనూ ఏర్పాటు చేశామన్నారు. ఈ సంబరాల్లో సినీ నటులు, జబర్దస్త్ టీము సాంస్కతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ తనయుడు అయితాబత్తుల రత్నకిరణ్, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, దంగేటి చిట్టిబాబు, పలచోళ్ల పద్మనాభం, లంకే భీమరాజు, అయితాబత్తుల రాజశేఖర్, ఉలిశెట్టి దొరబాబు, అయితాబత్తుల అజయ్ సింగ్, సత్తి చిన్న, రేవు తిరుపతిరావు, చీకట్ల శ్రీను, మన్నె వెంకటేశ్వరరావు, మంచెం బాబీ, ఆకేటి పెద్ద పాల్గొన్నారు.



అమలాపురం రూరల్‌లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన సంక్రాంతి వేడుకలు

ఆలమూరు నర్సిపూడి గ్రామాభివృద్ధికి మాజీ సొసైటీ అధ్యక్షుడు రాయుడు శంకు, ఆయన కుటుంబికులు చేసిన సేవలు ఎనలేనివని ఎఎంసి మాజీ చైర్మన్ దునే స్వామి నాయుడు కొనియాడారు. మండలంలోని నర్సిపూడి సొసైటీ వద్ద రాయుడు శంకు, నాగమణి దంపతుల జ్ఞాపకార్థం సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకు కుమారులు స్థానిక సొసైటీ మాజీ అధ్యక్షుడు రాయుడు వెంకటస్వామి(బాబ్జి), రాజమండ్రి మాజీ కార్పొరేటర్ రాయుడు సతీష్ మాట్లాడారు. గ్రామాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుత్తుల శ్రీరాములు, కొత్తపల్లి వెంకటరమణ, చామకూరి శ్రీను, ఉండమట్ల శేషగిరిరావు, మద్దిరెడ్డి కామరాజు, మద్దిరెడ్డి చిన్న, గానుగుల వెంకటరమణ, దంగేటి ప్రసాద్, గుల్ల చిన్ని, మద్దిరెడ్డి సతీష్, రాయుడు గోవిందరాజు పాల్గొన్నారు.


ఆలమూరులో ముగ్గుల పోటీ విజేతలతో శంకు కుటుంబ సభ్యులు


అమలాపురంలో బాలాజీ దంపతులను సత్కరిస్తున్న పుర ప్రముఖులు

కార్టూ'నిజం'



భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ సుభాష్ చంద్రబోస్

14 నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఈ నెల 14 నుంచి రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం అవుతాయని బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. 14 సాయంత్రం నుంచి 17 వరకూ జరిగే టోర్నమెంట్‌లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. రాష్ట్ర మంత్రి సుభాష్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ పాల్గొంటారని ఆయన వివరించారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో పోటీలకు సర్వం సిద్ధం చేశామని ఆయన వివరించారు. ఏర్పాట్లను ఆదివారం రాజ్యసభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ పరిశీలించారు.

బరులు, జూదాలకు ఏర్పాట్లు సిద్ధం

కోర్టు ఆదేశాలు బేఖాతరు

ప్రజాశకి-రామచంద్రపురం, ముమ్మిడిరం

సంక్రాంతి పేరుతో గ్రామాల్లో నిర్వహించే కోడిపందేలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని హైకోర్టు ఆదేశించినా క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదు. రామచంద్రపురం నియోజకవర్గంలో వెల్ల, కాకినాడ రోడ్, విఎస్ఎం.కాలేజీ పక్కన కోడిపందేలకు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు ప్రారంభించారు. సంక్రాంతి సంబరాలు పేరుతో కోడిపందాలు, గుండాటలు నిర్వహించేందుకు ఇప్పటికే బరులు సిద్ధం చేసుకుని టెంట్లు వేసుకున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో పందేల నిర్వహణకు సమాయత్తం అవుతున్నారు. ఆదివారం రాత్రి నుంచి లేదా సోమవారం ఉదయం నుంచి పందేలకు సిద్ధంగా ఉన్నారు. కె.గంగవరం మండలం పామర్రు, కె.గంగవరం, కుడుపూరులో కోడిపందేలకు బరులు సిద్ధం చేస్తున్నారు. ఒకవైపు హైకోర్టు ఆదేశాలను అమలు చేయలేకపోవడంతో పాటు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కట్టిన చర్యలు చేపడతామన్న పోలీసులు ప్రకటనలకే పరిమితమైనట్టు తెలుస్తోంది. ఏటా సంక్రాంతికి పోలీసు ప్రకటనలు మామూలే. పందేల నిర్వహణ మామూలే అన్న రీతిలో కొనసాగుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతోపాటు పందేల వద్ద డిజె మ్యూజిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. కూటమి నాయకుల అండదండలతోనే కోడిపందేల నిర్వహణకు ఆయా గ్రామాల పార్టీ నాయకులు యువకులు పందేలకు సిద్ధమయ్యారు. రూ.లక్షల్లో పందేలు చేతులు మారుతుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా కోడిపందేల ద్వారా రూ.కోట్లలో మారకం జరుగుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏది ఏమైనా కోర్టు ఆదేశాలు, పోలీసుల ప్రకటనలు పట్టించుకోకుండా నిర్వాహకులు తాము ఏం చేసినా చెల్లుతుంది అనే విధంగా కోడిపందేలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ముమ్మిడివరం సంక్రాంతి పండుగ సందర్భంగా ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలా సాగర్ హెచ్చరించారు. నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెంలో సిద్ధం చేసిన బరిని ట్రాక్టర్‌తో దున్నించి ధ్వంసం చేశారు.

ఆత్రేయపురం మండలంలోని మొత్తం తొమ్మిది బరులు సిద్ధం చేశారు. గుండాట, జూదం వంటివి కూడా సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. గుండాటాడేందుకు రూ.లక్షల్లో పాటలు పడుకున్నట్టు తెలుస్తోంది. పేరవరం, ఆత్రేయపురం, ర్యాలి, తాడిపూడి గ్రామాల్లో కోడి పందేలకు బరులను సిద్ధం చేశారు.


షాప్‌ను ప్రారంభిస్తున్న సినీనటి మీనాక్షి చౌదరి

హ్యాపీ మొబైల్స్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం

హ్యాపీ మొబైల్స్ స్టోర్‌ను పట్నంలో సినీతార మీనాక్షి చౌదరి ఆదివారం ప్రారంభించారు. మీనాక్షి చౌదరి రెడ్ మీ 14సి 5జి మొబైల్ ఫోన్‌ను లాంచ్ చేశారు. స్మార్ట్ మొబైల్స్, ఎల్ఇడి స్మార్ట్ టివిలు, లాప్ టాప్‌లపై ఎన్నో వినూత్న ఆఫర్స్ నూతన షో రూమ్ ప్రారంభంతో పాటు సంక్రాంతి సందర్భంగా కస్టమర్లకు అందిస్తున్నట్టు హ్యాపీ మొబైల్స్ సిఎండి కృష్ణ పవన్, ఎడి కోట సంతోష్ తెలిపారు.

కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి



జిల్లాలో సంక్రాంతి పండగ నేపథ్యంలో సంప్రదాయం పేరుతో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి డి.నరసింహకిషోర్ హెచ్చరించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కోడి పందేలు, పేకాట, గుండాట తదితర జూదాల నిర్వహణకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో స్థానికులతో మాట్లాడి అవగాహన కల్పించామన్నారు. జూదాల వల్ల పేద ప్రజానీకంపై తీవ్ర ఆర్థిక ప్రభావం పడుతున్నందున వ్యవసనాలకు దూరంగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు.

బైండోవర్ కేసుల నమోదు

కోడి పందేలు, జూదాలు ఆడకుండా జిల్లా వ్యాప్తంగా పాత నేరస్తులపై నిఘా ఉంచాం. తాళ్లపూడి మండలంలోని 6 గ్రామాల్లో, చాగల్లు మండలంలో 4 గ్రామాల్లో, కొవ్వూరు మండలంలో 8 గ్రామాల్లో నిడదవోలులో సింగవరం, కడియం మండలంలో శివారు గ్రామాలు అదే విధంగా జిల్లాలోని 18 మండలాల్లో బరులు నిర్వహిస్తారనే సమాచారం ఉన్న ప్రతీ చోటా అక్కడ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ల ద్వారా ప్రత్యేక నిఘా ఉంచాం.

ప్రజాశక్తితో ఎస్‌పి నరసింహకిశోర్

స్థలాల యజమానులకు నోటీసులు

కోడి పందేలు, జూదాల నిర్వహణకు ఆయా ప్రాంతాల్లో కొందరు స్థలాల యజమానులకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాం. అనుమానిత స్థల యజమానులకు ఇప్పటికే నోటీసులు అందించాం. గతంలో పందేలు నిర్వహించిన కొన్ని స్థలాల యజమానులను గుర్తించి వారికి అవగాహన కల్పించాం. అన్ని మండలాల్లోనూ అవగాహనా సదస్సులు, మైక్ ప్రచారాలు జరిపాము.

జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బందాలు

కోడి పందేలు, జూదాలు నిర్వహించకుండా జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఈ బృందంలో ఒక స్టేషన్ హౌస్ అధికారి, ఒక రెవెన్యూ అధికారి, ఒక పశు సంవర్ధక శాఖ సిబ్బంది లేదా ఒక ఎన్‌జిఒ ఉంటారు.



సంప్రదాయ క్రీడలే ముద్దు

కోడి పందేలు, గుండాట, ఇతర నిషేధిత ఆటలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవు. ముఖ్యంగా యువత జూద క్రీడలకు దూరంగా ఉండాలి. ఈ క్రీడలలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ క్రిమినల్ కేసుల్లో యువత చిక్కుకుంటే వారు భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు కోల్పోతారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో సంప్రదాయ క్రీడలకు మొగ్గుచూపాలి. కుటుంబ సభ్యులతో ఆనందంగా ఈ పండుగను జరుపుకోవాలి.



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

గోకులాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పాడి రైతులు మినీ గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ సూచించారు. మండలంలోని టి.రాయవరం గ్రామంలో నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినీ గోకులం ఏర్పాటుతో పాడిపశువులు వాన, ఎండ వడ దెబ్బలకు గురికాకుండా ఆరోగ్యంగా ఉంటాయన్నారు. అనంతరం ఉత్తర కంచి నుంచి పెద్దిపాలెం రహదారిని రూ.1.50 కోట్లతో నిర్మించే నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం ఈ రహదారి పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రహదారుల నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కుమార్‌బాబు, ఎపిఒ కుమార్‌స్వామి, టిడిపి నాయకులు కొమ్మల కన్నబాబు, చక్కపల్లి మందీశ్వరరావు, మంతెన శ్రీను, ఇళ్ల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో భారీ చోరీ

ప్రజాశక్తి- అమలాపురం

అమలాపురం పట్టణం కురసాల వారి వీధిలో కోలా శేషు ఇంటిలో శనివారం రాత్రి దొంగలు పడి సుమారు 30 కాసులు బంగారం, రూ.లక్షా 50 వేల నగదు అపహరించినట్టు ఇంటి యజమాని శేషు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి గదిలో ఆయన నిద్రిస్తుండగానే దొంగలు బంగారం, నగదు దొంగలించారని తెలిపారు. డిఎస్‌పి ప్రసాద్, పట్టణ సిఐ వీరబాబు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలను అడ్డుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో కోడిపందేలు, జూదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ కె.శ్రీరమణి ఆదివారం ఓ ప్రకటనలో అధికారులను ఆదేశించారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కోడిపందాలు, జూదాలు జరగకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో అధికారులు, సిబ్బంది పర్యటించి తనిఖీలు నిర్వహించాలన్నారు. సంకురాత్రి పర్వదినాలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకునేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని ఆదేశించారు.

అండర్-14 క్రికెట్‌కు రేవంత్ ఎంపిక

ప్రజాశక్తి - కరప

కరప గ్రామానికి చెందిన అడపా రేవంత్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరుపున అండర్-14 క్రికెట్ జంటుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు బోండా సూర్యారావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, పూర్వ విద్యార్థి సంఘం, ప్రజా ప్రతినిధులు నాయకులు గ్రామ ప్రజలు రేవంత్‌ను పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. మరిన్ని విజయాలు సాధించాలని అంతర్జాతీయ క్రికెట్‌కి సెలెక్ట్ అవ్వాలని ఆకాంక్షించారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక సత్యనారాయణపురంలో సంక్రాంతిని పురష్కరించుకుని నిర్వహించిన ఎస్ఎన్‌పి ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ముగిసింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శివ సికర్స్ టీమ్ విన్నర్‌గానూ, ఎస్ఎన్‌పి ఇండియన్ టీమ్ రన్నర్‌గా నిలిచింది. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సేపేని సురేష్, టిడిపి నాయకులు పడాల వీరబాబు, నాయకులు పుప్పాల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం, క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శ్రీ సత్యసాయి మందిరంలో చల్ల సాయిరాం అధ్యక్షతన ఆదివారం బాలబాలికలకు చిత్రలేఖనం, క్విజ్, ఏకాగ్రతలపై పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలైన ఇద్దరు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ గోవిందరాజులు, వై.వీరభద్రరావు, హెచ్‌డిఎఫ్‌సి వైస్ ఛైర్మన్ ఎన్.శ్రీనివాస్, కె.రాధిక, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్సవ మండపం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సహాయ సహకారాలతో నిర్మించిన ఉత్సవ మండపాన్ని నేడు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, ఎంపి తంగెళ్ల ఉదయశ్రీనివాస్ ప్రారంభిస్తారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె విజయలక్ష్మి తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొంటారని ఆమె తెలిపారు.

జూదాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పిఠాపురం

కోడిపందేలు, జూదాల పట్ల యువత దూరంగా ఉండాలని ఎస్ఐ వి.మణికుమార్ కోరారు. పట్టణ పరిధిలో ఆటో మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. అందరూ సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించి ఈ సంక్రాంతిని వారి కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

టిడిపి నాయకునికి పరామర్శ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని హుస్సేన్ పురం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు కోట అప్పారావును ఎంఎల్ఎ చినరాజప్ప తనయుడు రంగనాగ్ పరామర్శించారు. మాతృవియోగంతో బాధపడుతున్న అప్పారావును పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



ఒకే వేదికపైకి చేరుకున్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - యానాం

విద్యాభ్యాసం అనంతరం వివిధ ప్రాంతాల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా 38 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆ మధురజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్ 1987 బ్యాచ్ విద్యాసంవత్సరంలో 10వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులంతా ఆదివారం తాము చదువుకున్న చదువులమ్మ చెట్టునీడకు మళ్లీ చేరుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ వారి కుటుంబసభ్యులు తదితర వివరాలను పంచుకుంటూ ఆనందోత్సవాల మధ్య రోజంతా ఆటపాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సలాది సుబ్బారావు, సలాది సాంబశివరావు, సౌభాగ్యవతి, ధూళిపూడి నాగేశ్వరరావు, ఖాదర్ గృహాలకు వెళ్లి వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైమానిక దళ మాజీ అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి దవులూరి బులివీరాస్వామి, నిసర్గ ఇన్ఫర్మేషన్ అధినేత కన్నన్, తదితరులు పాల్గొన్నారు.



భోగి మంటను చిన్నారులతో వెలిగిస్తున్న ఛైర్మన్ జయరామారావు

శ్రీ వేద స్కూల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక శ్రీ వేద స్కూల్లో ఛైర్మన్ గుత్తుల గోవింద జయరామారావు, డైరెక్టర్ అర్జున్ నీతూహరి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాజమాన్యం, విశ్రాంత హెచ్ఎం వీరభద్రరావు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులకు బోగి పళ్ళు వేసి ఆశీర్వదించారు. చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి సంబరాల్లో పాల్గొన్నారు. హరిదాసు వేశధారణ, సోదమ్మ, గోదాదేవి రూపాలంకరణ, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, నెహ్రూ యువ కేంద్ర సంఘటన ఆంధ్రప్రదేశ్, యానాం డైరెక్టర్ అన్నుమన్ ప్రసాద్‌దాస్ పాల్గొన్నారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.ముత్యాలు, వాసంశెట్టి ఆనంద్ పాల్గొన్నారు.

ఐపిఎల్ క్రికెటర్ రాజు సోదరులకు ఘన సత్కారం

ప్రజాశక్తి -మామిడికుదురు

ఐపిఎల్ క్రికెటర్ పెనుమత్స వెంకట సత్యనారాయణ రాజు, అతని సోదరుడు రంజీ క్రికెట్ క్రీడాకారుడైన పాండురంగరాజు సంక్రాంతి సందర్భంగా ఆదివారం స్వగ్రామం గోగన్నమఠం వచ్చారు. వారు ఇంటర్నేషనల్ క్రికెట్ జట్టుకు ఎంపిక కావాలని స్థానికులు ఆకాంక్షిస్తూ ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి భూపతిరాజు లక్ష్మి, భూపతిరాజు సత్తిబాబు రాజు, సాగి పిఆర్‌విఎస్ఎస్.నరసింహవర్మ, సాగి సత్యనారాయణ రాజు, భూపతి రాజు సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు పోదూరు వాసులు ముదునూరి కిషోర్ కుమార్ కృష్ణవేణి దంపతులు రూ.10,116 ఆదివారం విరాళంగా అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. శేష వస్త్రాలతో సత్కరించి స్వామి వారి చిత్రపటం అందజేశారు.

గోదా రంగనాథుల కల్యాణానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి -ఆత్రేయపురం

వాడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం గోదా రంగనాథుల కళ్యాణానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఆలయ డిసి నల్లం చక్రధర రావు తెలిపారు. పది వేల మంది యాత్రికులు గోదా రంగనాథుల కల్యాణంలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా అన్ని ఏర్పాట్లూ చేసినట్లు ఆలయ డిసి తెలిపారు.

మల్లిబాబుకు ఎంఎల్ఎ పంతం పరామర్శ

ప్రజాశక్తి - కరప



నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ పంతం

జనసేన మండల కార్యదర్శి పప్పుల మల్లిబాబును ఎంఎల్ఎ పంతం నానాజీ పరామర్శించారు. మల్లిబాబు తల్లి రమావతి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన మల్లిబాబు స్వగృహానికి చేరుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శ కార్యక్రమంలో నాయకులు హరినాథ్, బండారు మురళీ, తుమ్మలపల్లి గోవిందు, గంట మల్లేశ్వర స్వామి పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

స్వామి వివేకానంద 162వ జయంతిని ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఎర్రవంతెన వద్ద వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వైస్ ప్రెసిడెంట్ గోకరకొండ నాగేంద్ర, క్లబ్ సెక్రటరీ బూరగాయల శివరామకృష్ణ, ట్రెజరర్ పడాల నాయుడు, గుర్రం రామకృష్ణ, పుచ్చ కామేశ్వరరావు, పట్నాల రమణ పాల్గొన్నారు.

ఆలమూరు జొన్నాడ చెరువుగట్టు వద్ద గల స్వామి వివేకానందుని విగ్రహానికి జొన్నాడ మాజీ సర్పంచ్ ద్వారంపూడి అప్పారెడ్డి, యువశక్తి సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి రామారెడ్డి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. భారీ కేక్ ను కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. చిన్నారులకు స్వీట్లు పంచారు. మాజీ ఎంపిటిసి తాడి నాగమోహన్ రెడ్డి, గొలుగూరి సూర్రెడ్డి, కర్రి గంగిరెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి, తాడి చిన్న రాము, మేడపాటి వెంకటకృష్ణా రెడ్డి, నాంద్ర దొరరెడ్డి పాల్గొన్నారు.



ఆలమూరులో నివాళులర్పిస్తున్న అప్పారెడ్డి తదితరులు

అంబాజీపేట జెడ్‌పి హైస్కూల్లో అరిగెల బలరామమూర్తి, స్పెషల్ జిల్లా కోర్టు జడ్జి ఆధ్వర్యంలో వివేకాందునికి ఘనంగా నివాళులర్పించారు. పంచాయతీరాజ్ డిఇ అన్యం రాంబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో బొంతు పెదబాబు, హెచ్ఎం సాయిరామ్, పులిదిండి సత్యనారాయణ, హైస్కూల్ ఛైర్‌పర్సన్ పి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి-కాట్రేనికోన

గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి అభివృద్ధికి బాటలు వేస్తున్నట్టు ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన ఉపాధి హామీ నిధులతో చేపట్టి పూర్తి చేసిన సిమెంట్ రహదారుల ప్రారంభోత్సవంలో ఆదివారం ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని పల్లంకుర్రు పంచాయతీ పరిధిలోని గొల్లల వీధి, కందిపప్పు శివారు గాజింగంతిప్ప, కాట్రేనికోన శివారు తిమ్మాపురం, ఉప్పూడిలో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఎంఎల్ఎ సుబ్బరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నాగిడి నాగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, డిసి ఛైర్మన్ ఆకాశం శ్రీనివాస్, వైస్ డిసి ఛైర్మన్ వాసంశెట్టి రాజేశ్వరరావు, ఇసుక పట్ల వెంకటేశ్వర రావు, విత్తనాల బుజ్జి, ఎస్‌విఎస్ వర్మ, అధికారులు పాల్గొన్నారు.



రోడ్లను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

పిహెచ్‌సికి వైద్య పరికరాల అందజేత

ప్రజాశక్తి-అంబాజీపేట

ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అవేర్ గ్రూపు పాన్ ఇండియా ఎస్‌బిఐ సహకారంతో సిఎస్ఆర్ యాక్ట్ విట్స్‌లో భాగంగా అవసరమైన పరికరాలను వైద్యాధికారి ఎ.ఇంద్రావతికి అందజేశారు. లేబర్ రూమ్ టేబుల్, ఒటి టేబుల్, స్టాండింగ్ బిపి మెషన్, మాన్యువల్ డిజిటల్ బిపి మిషన్‌లను బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎంవివిఎం.కృష్ణ, వారి ప్రతినిధుల ద్వారా అవేర్ గ్రూప్ బ్రాంచి ఛైర్మన్ మాదవన్ జీ ప్రాజెక్టు డైరెక్టర్ వరుణ్, ప్రతినిధులుగా పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు రీజనల్ మేనేజర్ అవేర్ గ్రూపు ప్రతినిధులకు వైద్యాధికారి ఇంద్రావతి సేవలను అభినందించారు.



ముక్కామల పిహెచ్‌సికి అందజేసిన వైద్యపరికరాలతో సిబ్బంది

కోడి పందేల బరులు సిద్ధం

సంక్రాంతి సంబరాల పేరుతో జిల్లాలో కోడి పందేల బరులు సిద్ధం అయ్యాయి. పందేల నిర్వహణకు ఏర్పాటు చేసిన కొన్ని బరులను గత రెండు రోజులుగా అధికారులు ధ్వంసం చేశారు. అయితే సంక్రాంతికి ఒక్క రోజు ముందు రాత్రికి రాత్రే భారీ సెటింగులతో పందెం బరులు సిద్ధం అయ్యాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండుగ వరకూ రాత్రి పగలు తేడా లేకుండా కోడి పందేలు, గుండాట వంటి క్రీడలు నిర్వహించేందుకు ప్రతీ మండలంలో 20 నుంచి 30 బరులు సిద్ధం అయ్యాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

పిఠాపురం డిప్యూటీ సిఎం, స్థానిక ఎంఎల్ఎ పవన్ కళ్యాణ్ ఇలాకాలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో కోడిపందాల నిర్వహణకు బరులు సిద్ధం అయ్యాయి. టిడిపి, జనసేన పార్టీలకు చెరందిన నాయకులు పిఠాపురం మండలం, పట్టణంలో 16, కొత్తపల్లి 11, గొల్లప్రోలు 8 మొత్తంగా 35 చోట్ల బరుల సిద్ధం చేశారు. వీటిలో 11 చోట్ల ఇరు పార్టీలు ఉమ్మడిగా బరులు ఏర్పాటు చేయగా, మిగిలిన బరులన్నీ జనసేన నాయకుల సారధ్యంలో ఏర్పాటు అయ్యాయి. స్థానిక వైఎస్ఆర్ గార్డెన్స్‌లో వేదికపైనే మట్టితో ప్రత్యేక బరిని ఏర్పాటు చేయడం విశేషం. **యు.కొత్తపల్లి** మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేల నిర్వహణకు బరులను ఏర్పాటు చేశారు. ఈ బరుల ఏర్పాటులో టిడిపి, జనసేన పార్టీల నాయకుల మధ్య విభేదాలు పొడచూపాయి. ఇదిలావుంటే కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన బరులను ధ్వంసం చేశారు.

నత్తనడకన వ్యవసాయ పనులు



వేగాయమ్మ పేటలో ఆకుతీత తీస్తున్న కూలీలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వ్యవసాయ శాఖ డిసెంబర్లో పూర్తి చేయాలని పిలుపునిచ్చిన దాళ్వా వరి నాట్లు జనవరి రెండో వారానికి కూడా పూర్తి కాకపోవడం విశేషం. ఏడాది తొలకరిపంట జాప్యం కావడంతో పాటు, వ్యవసాయ పనులు నత్త నడకగా సాగుతున్నాయి. ఇప్పటివరకు రామచంద్రపురంలో 80 శాతం, కె.గంగవరం మండలంలో 90 శాతం వరి నాట్లు పూర్తయినట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇంకా మామూలు ప్రాంతాలు నెలపర్తిపాడు, ఆదివారంపేట, వెలంపాలెం, పాణింగపల్లి తదితర ప్రాంతాల్లో వరి నాట్లు ఆలస్యంగా వేస్తున్నారు. మరికొన్ని శివారు పొలాలు దమ్ములు చేస్తున్నారు. మరో 10 రోజులకు వరి నాట్లు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. దాళ్ల డిసెంబర్ నాటికి వరి నాట్లు పూర్తి చేస్తే ఏప్రిల్‌లో అపరాల పంటలు వేసుకోవచ్చు అని అధికారులు సూచించారు. అయినా దీనిని రైతులు అంతగా పట్టించుకోకపోవడంతో సాగు నెమ్మదిగా కొనసాగుతుంది.

లయన్స్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-రావులపాలెం

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎపి కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి అన్నారు. స్థానిక సాయిరామ్ హాస్పిటల్ వద్ద ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి, కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కర్రి సుబ్బారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా 50 మందికి కళ్లజోళ్ల పంపిణీ చేశారు. పది మంది హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నందం వీర వెంకట సత్యనారాయణ, మన్యం ప్రదీప్, చిర్ల కనికిరెడ్డి, కర్రి శ్రీరామ చంద్రారెడ్డి, నాగరాజు, గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సేవలు వెల లేనివి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని శ్రీవిఘ్నేశ్వర లారీ ట్రాన్స్‌పోర్ట్ సభ్యులు పేర్కొన్నారు. వారి ఆధ్వర్యంలో గ్రామంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆదివారం నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో నాంద్ర నాగమోహన్ రెడ్డి, తాడి మెహర్ ఆదిత్య రెడ్డి, తాడి శ్యామ్ సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ప్రముఖుల పూజలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామిని ఆదివారం రుడా బొడ్డు వెంకటరమణ చౌదరి, ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు దర్శించుకున్నారు వీరికి ఆలయ డిసి స్వామివారి చిత్రపటాలను అందజేశారు. శ్రీవెంకటేశ్వర స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మహేశ్వరరావు దంపతులు దర్శించుకున్నారు అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.